కార్పొరేషన్ల రుణాల కోసం ఎదురుచూపు

- దరఖాస్తు చేసుకున్న వందలాది మంది నిరుద్యోగులు
- ఇంటర్వ్యూలు నిర్వహించాక చేతులెత్తేసిన ప్రభుత్వం
- ఎప్పుడు ఇస్తారో తెలియక ఆందోళన


నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

నూజివీడు: కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న బీసీ, ఓసీ నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మొండిచేయి చూపించింది. నిరుద్యోగ యువత ఏదో ఒక వ్యాపారమో, కుటీర పరిశ్రమో ఏర్పాటు చేసుకుని సొంతంగా తమ కాళ్ల మీద నిలబడేలా 50 శాతం రాయితీతో రుణాలు ఇస్తామని, నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ నాయకులు ఊరూరా ప్రచారం చేసి ఊదర గొట్టారు. కులాల వారీగా ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రచారం చేసింది. ఇందుకు అనుగుణంగా బీసీ, కాపు, రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, మేదర, కుమ్మరి, శాలివాహన తదితర కార్పొరేషన్లు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్లు జారీ చేశాయి. దీంతో వందలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వం రుణాలిస్తుందనే ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో మండలానికి వంద లోపు యూనిట్లను కేటాయించారు. దీంతో వందలాది మంది నిరుద్యోగులు నెట్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేసి రాయితీ రుణాల కోసం అర్జీలు పెట్టుకున్నారు. ఒక్కో పంచాయతీలో

మండలం	కేటాయించిన యూనిట్లు	వచ్చిన దరఖాస్తులు
నూజివీడు టౌన్	103	1,215
నూజివీడు	76	754

ముగ్గురు లేదా నలుగురుకి మాత్రమే రాయితీ రుణం పొందే అవకాశం ఉండడంతో దరఖాస్తుదారులు కూటమి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులను ఆశ్రయించి సిఫార్సులు చేయించారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తి చేశారు. ఈ జాబితాలను బ్యాంకులకు పంపగా బ్యాంకు అధికారులు మళ్లీ వీరిలో కొంత మందిని ఎంపిక చేసి ఆ జాబితాను కలెక్టర్ అనుమతి కోసం పంపించారు. ఈ తతంగం అంతా మార్చి, ఏప్రిల్ నెలల్లో సాగింది. అయితే తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రుణాల ప్రక్రియ నిలిపి వేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా ఉన్నతాధికారులకు అనధికారికంగా సందేశాల రూపంలో ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో మూడు నెలలు గడిచినా ఇంతవరకు లబ్ధిదారులను ఎంపిక చేయకుండా పక్కన పెట్టేశారు.

ఇంటర్వ్యూలు చేసి మిన్నకుండిపోయారు



సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని హంగామా చేసి దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు చేసి మిన్నుకుండిపోయారు. రుణాలు ఇవ్వలేనప్పుడు దరఖాస్తులు స్వీకరించడం, ఇంటర్వ్యూలు చేయడం ఎందుకు? ఇదంతా చూస్తుంటే ఒక రకంగా నిరుద్యోగులను మోసగించినట్లే.

– నిమ్మగడ్డ నరసింహ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, నూజివీడు

ఎంతో ఆశగా దరఖాస్తు చేసుకున్నారు



సబ్సిడీ రుణాలు వస్తాయని వందలాది మంది నిరుద్యోగులు ఎంతో ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలు పూర్తి చేసిన తరువాత రుణాలు మంజూరు చేయకుండా ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణం. సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణాలు మంజూరు చేయాలి.

–జి.రాజు, సీపీఎం నాయకులు, నూజివీడు

క్లుప్తంగా

రైల్వేలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నిరసన



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డెప్యూటీ డివిజనల్ కార్యదర్శి గద్దా సురేష్ డిమాండ్ చేశారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు ప్రధాన గేటు వద్ద కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు రూపొందిస్తూ కార్మిక లోకానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. కేంద్ర విధానాలతో భవిష్యత్ తరాల కార్మికుల మనుగడ ప్రశ్నార్థకం కానుందని చెప్పారు. 8వ పేకమిషన్ ఏర్పాటు చేసి, దాని విధివిధానాలు ప్రకటించాలన్నారు. రైల్వే ప్రైవేటీకరణ నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు పి. శివనాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి డేవిడ్‌రాజు, కోశాధికారి విమల్‌సాయి, సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ, మండల స్థాయి అధికారులకు ఒక రోజు శిక్షణ సదస్సు బుధవారం నిర్వహించారు. వర్క్‌షాపులో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనకు పాటించాల్సిన విధివిధానాలను తెలియజేశారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగు, క్లీన్ అండ్ గ్రీన్, మౌలిక వసతుల కల్పన, తాగునీటి సదుపాయం, సామాజిక భద్రత కల్పించడం వంటి అభివృద్ధి ప్రణాళికల అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ సునీత శర్మ, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్‌కుమార్, డాక్టర్ పర్వీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



తిరువూరు: స్థానిక నాగార్జునసాగర్ క్యాంపు కాలనీలో గంజాయి తరలిస్తూ ఐదుగురు వ్యక్తులు బుధవారం పోలీసులకు పట్టుబడ్డారు. తిరువూరు సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సిబ్బంది గత రెండు రోజులుగా పట్టణంలో గంజాయి విక్రయాల నిరోధానికి జరుపుతున్న దాడుల్లో భాగంగా ఎన్ఎస్‌పీ కాలనీ ప్రాంతంలో తనిఖీ చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ పోలీసులకు చిక్కారు. తిరువూరుకు చెందిన కోట ఆకాష్, నాగవరపు కల్యాణ్, చావల తంబిరాజు, అక్కపాలెంకు చెందిన కంచపోగు వెంకటేశ్వరరావు, పోలిశెట్టిపాడుకు చెందిన నాగుల వైష్ణవకుమార్‌లను ఐదు కిలోల గంజాయి ప్యాకెట్లతో సహా అదుపులోకి తీసుకున్నామని సీఐ గిరిబాబు తెలిపారు. తహసీల్దారు ఉదయభాస్కర్, వీఆర్వోల సమక్షంలో నిందితుల నుంచి గంజాయి స్వాధీనపరచుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



మైలవరం: రాష్ట్ర స్థాయిలో ఈనెల 12న అనంతపురంలో జరుగనున్న బేస్‌బాల్ పోటీలకు మైలవరం మండలం చిలుకూరువారిగూడెంకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎ. కుసుమ కుమారి బుధవారం తెలిపారు. ఈ నెల 6న నాగాయలంకలో జరిగిన జిల్లా స్థాయి సీనియర్ బేస్ బాల్ (ఉమ్మడి కృష్ణా జిల్లా) పోటీల్లో ఎం. వెంకట శ్రావణి, ఎస్. సాక్షి థామస్, బి. వినయ్‌కుమార్, కె.అభినవ్, పి. కార్తీక్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను హెచ్‌ఎం కుసుమకుమారి, వ్యాయామోపాధ్యాయుడు ప్రత్తిపాటి శ్రీనివాసరావు, పల్లపు శ్రీనివాసరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

లక్ష్మీపురంలో చోరీ

తిరువూరు: మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం రాత్రి ఒక నివాస గృహంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మిద్దె రంగారావు కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటిలోకి ప్రవేశించిన దొంగలు బీరువా తాళాలు తీసి 50 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. బుధవారం అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతు బజారు తనిఖీ



మైలవరం: రైతుల నుంచి కూరగాయలు సేకరించి రైతుబజార్ల ద్వారా అతి తక్కువ ధరలకే వినియోగదారులకు విక్రయించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జాయింట్ కలెక్టర్ ఇలక్కియా అన్నారు. మైలవరంలోని రైతుబజారును బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎవరైనా రైతు బజారులో షాపు పెట్టుకునే వారు ఉంటే కచ్చితంగా అవకాశం కల్పిస్తామన్నారు. ఖాళీగా ఉన్న షాపులను వెంటనే భర్తీ చేయాలని అధికారులకు సూచించారు. రైతులు తాము పండించిన కూరగాయలను రైతు బజారులో అమ్ముకుని లబ్ధిపొందాలన్నారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి, రైతులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



చాట్రాయి: మండలంలోని చాట్రాయి గ్రామంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద లింగం, డాక్టర్ నవీన్, సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల సమ్మె

ఇబ్రహీంపట్నం: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు వివిధ రంగాలకు చెందిన కార్మికులు బుధవారం సమ్మె నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన సమ్మెలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీవీ కృష్ణ మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, 8గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. హిట్ అండ్ రన్ కేసుల విధానం రద్దు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. స్కీమ్ వర్కర్లు, మున్సిపల్ వర్కర్స్‌కు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్, వివిధ కార్మిక సంఘాల నాయకులు కోలా రమేష్, బాబునాయక్, వెంకటేశ్వరరావు, గోపీకృష్ణ, రాజేశ్వరి, ఉషా, సునీత, కొండలరావు పాల్గొన్నారు.

ఏఐసీటీయూ ఆధ్వర్యంలో:
ఏఐసీటీయూ ఆధ్వర్యంలో కొండపల్లిలో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన ప్రదర్శన చేశారు. మండల అధ్యక్షుడు కె.బసవయ్య మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికులకు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. ఎస్.అరుణ, కె.రత్నం, మల్లికార్జునరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సార్వత్రిక సమ్మె విజయవంతం
తిరువూరు: కార్మిక సంఘాలు జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో బుధవారం కార్మికులు సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కార్యదర్శులు ఆయా సంఘాల ఎదుట ధర్నాలు నిర్వహించిన అనంతరం తిరువూరు కేడీసీసీ బ్యాంకు నుంచి బోస్ సెంటర్ వరకు ప్రదర్శన జరిపారు. సీఐటీయూ, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో తిరువూరులో కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు జరిపిన ప్రదర్శన, ధర్నాలో అంగన్‌వాడీ, రెవెన్యూ, మున్సిపల్ కార్మికులు, ఆశావర్కర్లు, ఆటో వర్కర్లు, స్కూల్ స్వీపర్లు పాల్గొన్నారు. కార్మిక సంఘ నాయకులు ఎం. నాగేంద్రప్రసాద్, రవిచంద్ర, భద్రం, బి. వెంకటేశ్వరరావు, ఆకుల రవి, పంతంగి శ్రీనివాసరావు, చిలుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రదర్శన నిర్వహించాయి.


కొండపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికలను ఉద్దేశించి మాట్లాడుతున్న డీవీ కృష్ణ, తదితరులు

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి
నూజివీడు: కేంద్ర ప్రభుత్వ విధానాల వలన కార్మిక హక్కులపై నిరంకుశ దాడులకు పాల్పడుతున్న కార్పొరేట్ వర్గాల తీరుపై ఉద్యమించేందుకు కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నూజివీడులో బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూల ఆధ్వర్యంలో పెద్ద గాంధీబొమ్మ సెంటర్ నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిర్వహించిన బహిరంగ సభలో రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ల పరం చేసి కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. ఈ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు కార్మిక వర్గం ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మండల కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు అక్కినేని ఆంజనేయ ప్రసాద్, మాదిరెడ్డి శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు నండూరి హనుమాన్లు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, రైతు సంఘం ఏలూరు జిల్లా నాయకులు రాయంకుల లక్ష్మణరావు, అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

- **చాట్రాయి:** కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన దేశ వ్యాప్త సమ్మె విజయవంతమైంది. ఈ సందర్భంగా 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాల పునరుద్ధరణ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. షాపులు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు. కార్మిక సంఘాల నాయకులు దుర్గం పుల్లారావు, కొమ్ము ఆనందం, ఈవీ శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


తిరువూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు


నూజివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు

మైలవరం: మైలవరంలో సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బుధవారం కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చాట్ల సుధాకర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వివిధ యూనియన్ల నాయకులు ధరణి కోట శ్రీను, మధు, శ్రీనివాస్, విజయ్, పుష్పకుమారి, సీహెచ్ శారద, పి. జ్యోతి, రమణ, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ, కార్మిక, రైతు వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు, సీఐటీయూ, కార్మిక సంఘ నాయకులు కేవీకేఎస్ ప్రసాద్, రాజులపాటి చంటి, ముత్యాల నరేష్, కె.అమృత, సీహెచ్ నీలాంబరి, విజయ్ కుమారి పాల్గొన్నారు.

- **ముసునూరు:** సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక మండపం సెంటర్, కార్యాలయాల సెంటర్‌లో ధర్నా, రాస్తారోకో, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. యూనియన్ నేతలు మద్దాల సునీత, విద్యావతి, రాజకుమారి, నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారుల పనులకు శంకుస్థాపన

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ సాధారణ నిధులతో చేపట్టిన పలు సీసీ రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.30లక్షల వ్యయంతో 7,8,10,12 వార్డుల్లో ఈ రహదారులను నిర్మించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ మనోజ తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ నిర్మల, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, నాళ్ళా సురేంద్ర, తంగిరాల వెంకటరెడ్డి, ఇనపనూరి చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం మండలం గణపరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ గణపవరం టౌన్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా


ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు, ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: అఖిల భారత ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ పంపిణీ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ వద్ద బుధవారం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లో 184 రోజులుగా ఉద్యోగులు చేపట్టిన నిరసనకు సంఘీభావంగా ధర్నా చేపట్టారు. జేఏసీ చైర్మన్ ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ యూపీ ప్రభుత్వం రెండు డిస్కమ్స్ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం వలన వినియోగదారులకు నష్టం జరుగుతుందన్నారు. ప్రైవేటీకరణతో ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం పడుతోందని చెప్పారు. సమస్య ఎదుర్కోలేకపోతే భవిష్యత్తులో విద్యుత్ సంస్థలు అన్నీ ప్రైవేటీకరణ చేస్తారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ వెంకటరావు, ఏఐటీయూసీ నాయకులు ఏసోబు, ఇంజినీర్స్ బ్రాంచ్ సెక్రటరీ చక్రపాణి, ప్రశాంత్ కుమార్, వెంకటరావు, శ్రీనివాస్‌కుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



మైలవరం: సహకార సంఘాలలో పనిచేస్తున్న సీఈఓలు సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మైలవరం సహకార కేంద్ర బ్యాంకు మైలవరం బ్రాంచ్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. సిబ్బంది మాట్లాడుతూ సహకార సంఘాలలో 2019 తరువాత పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని సహకార కేంద్ర సంఘాల సీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకువెళ్లిన కారు
వ్యక్తికి స్వల్ప గాయాలు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామంలో బుధవారం కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకువెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ సత్యనారాణపురానికి చెందిన దారపురెడ్డి సురేష్, అతని సోదరుడు కారులో మైలవరం వెళ్లారు. తిరిగి వస్తుండగా కొత్తూరు తాడేపల్లి హైస్కూల్ సమీపం ఎదురుగా లారీ వస్తుండటంతో పక్కకు వెళ్లిన కారు అదుపు తప్పి వంతెన సమీపంలో కాలువలో పడింది. సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స చేసి పంపారు. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వంతెనకు రెయిలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



చింతలపూడి ఎత్తిపోతల పూర్తిచేస్తాం
మంత్రి రామానాయుడు


విద్యార్థులతో మంత్రి రామానాయుడు

నరసాపురం(విస్సన్నపేట): మెట్టప్రాంతానికి ఉపయోగకరమైన చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని నరసాపురం గ్రామంలో బుధవారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం అందుకున్న విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు, కూటమి నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పనిచేయాలి

ముసునూరు: గ్రామ పంచాయతీల పురోగతి కోసం అధికారులు, ఉద్యోగులందరూ ప్రణాళికా బద్ధంగా పని చేయాలని ఎంపీడీఓ బీఏ సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతి సూచిక వెర్షన్ 2.0పై ఆయన లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రధాన పంచాయతీలు, వాటి శివారు గ్రామాల సౌకర్యాల కల్పన, అభివృద్ధికి తగిన ప్రణాళికతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు, ఏఈలు సత్యప్రసాద్, దుర్గాప్రసాద్, కార్యాలయ ఏఓ ఛాయాకుమారి, సీనియర్ సహాయకుడు సగ్గుర్తి శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మొఘల్ చెరువు గట్టు ఆక్రమణదారుల వివరాల సేకరణ

నూజివీడు: పట్టణంలోని హనుమాన్‌జంక్షన్ రోడ్డులో ఉన్న మొఘల్ చెరువు గట్టుతో పాటు గట్టు వెంబడి ఆక్రమణదారుల వివరాలను మున్సిపల్ అధికారులు బుధవారం సేకరించారు. మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి నేతృత్వంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది గట్టుపైన ఉన్న ఆక్రమణదారుల గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. ఆక్రమణలను తొలగించి కట్టను బలోపేతం చేసి వాకింగ్ ట్రాక్‌ను వేయాలనే ఉద్దేశంతో ఆక్రమణదారుల వివరాలను సేకరిస్తున్నారు. మొఘల్ చెరువు వెంబడి నివసిస్తున్న వారందరూ ఆందోళన చెందుతున్నారు. చాలా మంది ఆక్రమణదారులు లక్షలాది రూపాయలు పెట్టి స్థలాలను కొనుక్కొని ముందు భాగంలో షాపులను, వెనుక భాగంలో గృహాలను నిర్మించి అద్దెలకు ఇవ్వడం, తామే ఉండటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాము నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.